ఒడిశా | ఆదివారం | సెప్టెంబర్ | 23 | 2018 సాక్షి

# తక్షణ పరిష్కారానికి విజ్ఞానం దోహదపడాలి

- ప్రొఫెసర్ అశుతోష్ శర్మ
- ఐఐటీ ఉత్తీర్ణులకు ప్రబోధం
- 332 మందికి పట్టాలు
- నందూరి దివాకర్ మేధావి

భువనేశ్వర్: సమస్యకు తక్షణ పరిష్కారం ఆవిష్కరించడం నిజమైన మేధా శక్తి. ఐఐటీ మేధావంతుల్ని ఉద్దేశించి కేంద్ర వైజ్ఞానిక సాంకేతిక విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ అశుతోష్ శర్మ ప్రసంగించారు. స్థానిక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) 7వ కాన్వొకేషన్‌ను పురస్కరించుకుని ఉత్తీర్ణులకు ఆయన శనివారం పతకాల్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఏదైనా నేనే సాధించాలనే ఉత్సాహంతో యువతరం ముందుకు సాగాలి. భావి అవసరాల దృష్ట్యా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రయోగించడం నిజమైన మేధా శక్తిగా నిలుస్తుంది. ఊహాతీతమైన అవసరాలు, సమస్యల పరిష్కారం దృష్ట్యా తక్షణ సాంకేతికత నైపుణ్యాన్ని సమాజానికి ప్రదానం చేయడం నిజమైన గుర్తింపు సాధిస్తుంది. క్యాంపస్ విద్యాభ్యాసంతో సాధించిన ఘనమైన ఉత్తీర్ణత కంటే వాస్తవ పరిస్థితుల్లో విద్యార్థి దశలో అభ్యసించిన మేధా శక్తిని సమయస్ఫూర్తితో ప్రయోగించి ఉన్నత ఉత్తీర్ణతకు పట్టం గట్టాలని పిలుపునిచ్చారు.

## నిరంతరం పరిశోధించాలి

పట్టాలు సాధించడంతో విద్యాభ్యాసానికి తెరదించకుండా నిరంతర పరిశోధనపట్ల శ్రద్ధ వహించాలి. విద్యాధికులుగా బాహ్య ప్రపంచంలోకి అడుగుడిన తరుణంలో ఉద్యోగం కోసం పాకులాడకుండా మరెందరికో ఉద్యోగావకాశాలు కల్పించే వర్గంగా సమాజంలో వెలుగొందాలని ఆకాంక్షించారు. ప్రపంచాన్ని కుదిపేస్తున్న వాతావరణ మార్పు, సైబర్ నేరాలు వంటి పరిస్థితుల్ని సమర్థంగా పరిష్కరించే రీతిలో పరిశోధనలు జరగాల్సి ఉంది. ఉన్నత ఉత్తీర్ణతతో మేధావంతులుగా నిలిచిన ప్రతి విద్యార్థి తలెత్తే ఆకస్మిక సమస్యకు పరిష్కారవంతుడు కావాలి. వర్ధమాన సామాజిక స్థితిగతులు ఇదే సందేశాన్ని ప్రేరేపిస్తున్న విషయం గుర్తించాలని అశుతోష్ శర్మ సూచించారు. స్వీయ కలల సాకారం కోసం కాకుండా దేశం కలలు పండించేందుకు ఉత్తీర్ణులు అంతా కృషి చేయడం అనివార్యం. ప్రస్తుతం తాండవిస్తున్న సమస్యల్ని మేధా శక్తికి పదును పెట్టే చక్కని అవకాశాలుగా మలుచుకుంటే తిరుగు లేని భావి పౌరులుగా వెలుగొందుతారు. మార్పు ధ్యేయంగా యువతరం నిరంతరం కృషి చేయాల్సి ఉంది. వైఫల్యాలకు కుంగిపోకుండా సమస్యాత్మక సవాళ్లను దీటుగా అధిగమించడం ఈ రోజు నుంచే ప్రారంభించాలి. విద్యారంగంలో పట్టా సాధించిన మరు క్షణం నుంచి విద్యార్థి మేధాశక్తికి అసలైన పరీక్ష ప్రారంభమవుతుంది. ఈ పరీక్షలో సాధించిన ఉత్తీర్ణత సామాజిక మనుగడకు అక్కరకు వస్తుంది. దీంతో దేశం కలలు సాకారమవుతాయని ఐఐటీ మేధావంతులను ప్రొఫెసర్ అశుతోష్ శర్మ ప్రేరేపించారు.




కాన్వొకేషన్ వేదికపై అతిథులు

## 332 మందికి పట్టాలు

ఐఐటీ 7వ కాన్వొకేషన్‌ను పురస్కరించుకుని 332 మంది మేధావంతులకు ఆయన పట్టాలు ప్రదానం చేశారు. మెకానికల్ సైన్స్ విద్యార్థి నందూరి దివాకర్ రాష్ట్రపతి బంగారు పతకాన్ని సాధించాడు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగం విద్యార్థిని దేవలీన ముఖర్జీ, బేసిక్ సైన్స్ విభాగం విద్యార్థి సయాన్ రాయ్ డైరెక్టర్ బంగారు పతకం విజేతలుగా నిలిచారు. కేంద్ర వైజ్ఞానిక సాంకేతిక విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ అశుతోష్ శర్మ ఈ పతకాల్ని ప్రదానం చేశారు.

## రజత పతకం మేధావులు

పలు విభాగాల్లో మేధావంతులైన విద్యార్థులకు ఇనిస్టిట్యూట్ రజత పతకాల్ని ప్రదానం చేశారు. నందూరి దివాకర్, రామిరెడ్డిగారి రాహుల్ రెడ్డి, కోలా లక్ష్మి సాయి శ్రీ, స్నేహ సుశాన్ జార్జ్, సుధాంశు శ్రీవాస్తవ్, దేవలీన ముఖర్జీ, శ్రీ వికాష్ శర్మ బి. ఎస్., బారిక్ అనసూయ అనుపమ స్వాతి, పలాష్ స్వర్ణాకర్, కుప్పిలి రవితేజ, నజ్నిన్ నిఘార్ సుల్తానా, సయాన్ రాయ్, అస్మిత సింఘ రాయ్, రాహుల్ రాణా, దీపాంజలి హల్దార్ రజత పతకాల్ని సాధించారు. స్థానిక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. వి.రాజ కుమార్ అందజేశారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షుడు పంకజ్ రమణ్‌భాయి పటేల్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.



నందూరి దివాకర్‌కు రాష్ట్రపతి బంగారు పతకం ప్రదానం



పట్టాలు సాధించిన విద్యార్థులు



మేధావుల విజయోత్సాహం

సాక్షి Sun, 23 September 2018
epaper.sakshi.com/c/32462702

The Sakshi, Dt: 23.09.2018